ప్రజాశక్తి
గురువారం 13 జూలై 2023
5
శ్రీకాకుళం

దీర్ఘకాలిక సెలవులో డిఇఒ

ఇన్‌ఛార్జిగా ఆర్‌జెడి జ్యోతికుమారి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి డిఇఒగా విశాఖపట్నం ఆర్‌జెడి జ్యోతి కుమారి బాధ్యతలు చేపట్టనున్నారు. నాలుగు నెలల కిందట డిఇఒగా తిరుమల చైతన్య బాధ్యతలు చేపట్టారు. వమరవల్లి డైట్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయన పూర్తి అదనపు బాధ్యతలతో డిఇఒగా నియమితులయ్యారు. ఆయన విధుల్లో చేరిన తర్వాత ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు పెద్దఎత్తున జరిగాయి. రాజకీయ ఒత్తిళ్లను తట్టుకోలేక తనను డిఇఒ బాధ్యతల నుంచి తప్పించాలంటూ ఉన్నతాధికారులకు తిరుమల చైతన్య లేఖ రాసినట్లు తెలిసింది.

తిరుమల చైతన్య

రైతుల ఇళ్లలోనే నిల్వ ఉన్న జీడిపిక్కల బస్తాలు

పలాస మండలం మాకన్నపల్లికి చెందిన కుత్తుమ హేమవతికి 2.20 ఎకరాల జీడి తోట ఉంది. ఈ ఏడాది సుమారు 13 బస్తాల (బస్తా 80 కేజీలు) పంట దిగుబడి వచ్చింది. పంట చేతికొచ్చే సమయానికి ధర పడిపోవడంతో అమ్మేందుకు ఇష్టపడలేదు. ఈ ఏడాది ఏప్రిల్ రెండో వారం వరకు 80 కేజీల బస్తా రూ.10,500 వరకు పలికింది. ప్రస్తుతం రూ.8 వేలకు మించి ధర రావడం లేదు. దీంతో రేటు వచ్చే వరకు ఇంటి వద్దనే పిక్కలను దాచిపెట్టుకున్నారు.

ఇదే మండలం చిన్న నీలావతి గ్రామానికి చెందిన గొరకల బాలకృష్ణకు నాలుగు ఎకరాల జీడితోట ఉంది. సుమారు 24 బస్తాల పిక్కలు వచ్చాయి. పంట ఖర్చుల కోసం ఎకరాకు సుమారు రూ.25 వేలు చొప్పున రూ.లక్ష వెచ్చించారు. పెట్టుబడి, శ్రమకు తగిన ధర రాకపోవడంతో వ్యాపారులకు పిక్కలను ఇవ్వలేదు.

జీడిపిక్కలకు సరైన మద్దతు ధర రాక పిక్కలను అమ్ముకోలేని పరిస్థితి ఈ ఇద్దరి రైతులకు మాత్రమే పరిమితం కాలేదు. జిల్లావ్యాప్తంగా ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంలో ఈ పరిస్థితి ఉంది. రైతుల వద్ద పంట ఏమీ లేదని అంతా అమ్మేశారని చెప్తున్న అధికారుల ప్రకటనలకు, క్షేత్రస్థాయి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని చెప్పడానికి ఇవి నిదర్శనం.

మద్దతుపై మాట్లాడరేం?

- జీడి పంట చేతికి రానంత వరకు రూ.10వేలు పైన ధర
- పిక్కలు వచ్చిన తర్వాత రూ.8 వేలు లోపే
- రైతుల డిమాండ్‌తో వ్యాపారుల బంద్ మంత్రం
- ఇళ్లలోనే జీడిపిక్కల బస్తాలు
- గ్రామాల్లో దళారులతో కొనుగోళ్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

జిల్లాలో జీడి రైతుల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇళ్లలోనే దాచుకుంటున్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పంట అమ్మితే తక్కువ ధరకే ఇచ్చేయాల్సి ఉంటోంది. అమ్మకుండా నిల్వ ఉంచితే వర్షాలకు పిక్కలు పోయే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో రైతులు అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నారు. జిల్లాలో ప్రభుత్వ లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 70 వేల ఎకరాల్లో పైగా జీడి సాగమవుతోందని ఉద్యానశాఖ అధికారులు చెప్తున్నారు. సాధారణంగా ఎకరాకు ఐదు బస్తాల దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. ఉద్దానం ప్రాంతంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వ్యాపారులు జీడి పంట కొనుగోళ్లు ప్రారంభించారు. ఏప్రిల్ రెండో వారం వరకు 80 కేజీల బస్తాకు రూ.10,500 వరకు చెల్లించారు. పంట చేతికి రావడం, రైతుల వద్ద పుష్కలంగా పిక్కలు ఉండడంతో క్రమేణా ధర తగ్గిస్తూ రూ.8 వేల వరకు ఇచ్చారు.

జీడి పిక్కల కొనుగోలు విషయంలో వ్యాపారులు రకరకాల విన్యాసాలు సాగిస్తున్నారు. జీడి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, 80 కేజీల బస్తాకు రూ.16 వేలు ఇవ్వాలనే డిమాండ్ అంతకంతకూ పెరగడంతో వ్యాపారులు రూట్ మార్చారు. కొత్త రకం ఎత్తుగడకు తెర తీశారు. పంటను ఎక్కువ కాలం నిల్వ చేసుకోలేని రైతుల బలహీనతను గ్రహించి, వారంతట వారే పంటను తక్కువ ధరకు అమ్ముకునేలా బంద్ మంత్రం వేశారు. పరిశ్రమలు మూసేసిన తర్వాత పిక్కల అవసరమే ఉండదు. కానీ ప్రస్తుతం గ్రామాల్లో దళారులు జీడిపిక్కలను కొంటున్నారు. దళారులు కొంటున్న పిక్కలు ఎవరి దగ్గరకు వెళ్తాయో వేరే చెప్పనక్కర్లేదు. బంద్ పాటిస్తున్నామని చెప్తూనే మరోపక్క దళారులను రంగంలోకి దించి వారితో కొనుగోలు చేయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జీడి పిక్కలకు డిమాండ్ లేకపోవడం, మాంద్యం అని కబుర్లు చెప్పిన వ్యాపారులు ఆనక రైతులు ఎక్కువ ధరకు అడుగుతున్నారంటూ ప్రచారం సాగిస్తున్నారు.

వ్యాపారులకు వంతపాడుతున్న ప్రభుత్వం

జీడి రైతులకు మద్దతు ధర దక్కేలా చూడాల్సిన ప్రభుత్వం వ్యాపారులకు వంత పాడుతోంది. జీడి రైతులు ఎక్కువ ధర అడుగుతుండడం వల్లే వ్యాపారులు పరిశ్రమలను బంద్ చేయాల్సి వచ్చిందంటూ కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సైతం చెప్పడం గమనార్హం. మరోవైపు ఆ ప్రాంతానికి చెందిన పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు వైఖరి కూడా అలానే ఉంది. జీడి పిక్కలకు మద్దతు ధరపై వ్యాపారులు, రైతులతో ఒకసారి సమావేశం నిర్వహించి, తర్వాత దాని ఊసే ఎత్తలేదు.

రైతులు అడుగుతున్న రేటు ఇవ్వాలని మంత్రి ఆదేశిస్తే, వ్యాపారులు అమలు చేయకుండా ఉంటారా? పరిశ్రమలను బంద్ చేస్తే కార్మికుల ఉపాధి దెబ్బతింటుందని వద్దని వారిస్తే ఎవరు మూసేస్తారు? సహజంగానే ఇటువంటి ప్రశ్నలు తలెత్తుతాయి. రైతులు, కార్మికులు నష్టపోతున్నా అమాత్యులు పట్టించుకోవడం లేదంటే ఎవరి కోసం పనిచేస్తున్నారో ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

పోర్టు పనులకు అడుగులు

- రూ.3,880 కోట్ల రుణం కోసం కేబినెట్‌లో ఆమోదం
- కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు 41 మంది వైద్య సిబ్బంది నియామకం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సంతబొమ్మాళి మండలం మూలపేటలో నిర్మించనున్న పోర్టుకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.3,880 కోట్ల రుణం తీసుకునేందుకు కేబినెట్ ఆమోదించింది. రుణం మంజూరైతే పోర్టు పనులు ప్రారంభం కావడానికి అవకాశం కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లింపులు, పునరావాసం, పరిహారం చెల్లింపుల వరకు ప్రభుత్వం ఎపి మారిటైం బోర్డు ద్వారా రూ.వంద కోట్లు విడుదల చేసింది. ఈ డబ్బులతో నిర్వాసితులు, రైతులకు ప్రస్తుతం చెల్లింపులు చేపడుతున్నారు. పోర్టు తొలి దశ నిర్మాణానికి రూ.3,669.95 కోట్లు వ్యయం కానున్నట్లు తొలుత అంచనా వేశారు. ప్రస్తుత అవసరాలను బట్టి రూ.3,880 కోట్లు అవసరమవుతుందని గుర్తించి, అందుకనుగుణంగా రుణం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు వైద్యుల నియామకం

పలాసలో నిర్మిస్తున్న కిడ్నీ సూపర్ స్పెషాలిటీ, రీసెర్చ్ సెంటర్‌ను సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని ఈ ఏడాది ఫిబ్రవరిలో మూలపేట పోర్టు శంకుస్థాపన సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఆస్పత్రికి 41 మంది వైద్య సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన నియమించేందుకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది. అంతకుముందు సెప్టెంబర్ 25, 2019లో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం ప్రభుత్వం మూడు కేటగిరీల్లో పోస్టులను కేటాయించింది. రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగాల భర్తీకి జిఒ నంబరు 481 విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా కేటాయించిన వాటితో కలుపుకొని పోస్టుల సంఖ్య 101కు చేరనుంది.

21న ఉద్యోగుల గ్రీవెన్స్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రతినెలా మూడో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ డేను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహించనున్న ఉద్యోగుల గ్రీవెన్స్ డేను ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు వారి సమస్యలను తెలుపుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ సిఫార్సు పేరుతో చేస్తున్న అక్రమ బదిలీలు తక్షణమే నిలుపుదల చేయాలని, ఉపాధ్యాయులు జీతభత్యాలు చెల్లించే ఏర్పాటు వెంటనే చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపడుతున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విద్యాశాఖ నిర్లక్ష్యం వల్ల 3,600 మంది ఉపాధ్యాయులకు జూన్ నెల జీతాలు ఇంతవరకు చెల్లించలేదని పేర్కొన్నారు. మరో నెల రోజుల పాటు జీతాలు పొందలేని పరిస్థితి నెలకొందని తెలిపారు.

ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

ఉపాధి భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలను విలీనం చేయడం వల్ల ఏళ్ల తరబడి పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, వారికి ఉపాధి భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నాయని విమర్శించారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచడం లేదని, దీనివల్ల కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం లేకపోవడంతో అనేకమంది వంట చేసే సమయంలో అగ్ని ప్రమాదాలకు గురవుతున్నా, వారికి ఎలాంటి వైద్య సేవలు అందించడం లేదని విమర్శించారు. పథకం అమలుకు పాఠశాలల్లో వంటషెడ్లు, వంటపాత్రలు, మంచినీరు, గ్యాస్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మెనూను మారుస్తున్నా, అందుకు తగ్గట్లుగా నిధులు మంజూరు చేయకపోవడంతో అప్పులపాలవుతున్నారని తెలిపారు.

జగనన్న గోరుముద్ద పేరుతో ఇస్తున్న మెనూ ఛార్జీలతో సంబంధం లేకుండా రోజుకో ఐటమ్‌తో ప్రభుత్వం మెనూ తయారు చేసి వర్కర్లపై భారాన్ని మోపిందన్నారు. నూతన విద్యా విధానం అమలు వల్ల పొమ్మన లేక పొగ పెడుతున్న చందంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. జిల్లాలో వంట చేస్తుండగా అగ్ని ప్రమాదానికి గురై మృతి చెందిన కార్మికురాలు మలిపెద్ది రమాదేవి కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని, ఆమె కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఇఒ కార్యాలయ పాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సిఐటియు జిలా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకులు టి.రామానుజమ్మ, ఎన్.గీతాబాల, ఎం.కుమారి, ఎ.పద్మ, ఆదిలక్ష్మి, కె.నారాయణమ్మ, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరానికీ సాగునీరు అందిస్తాం

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

ఆమదాలవలస నియోజకవర్గం లోని ప్రతి ఎకరానికీ సాగునీరు అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని గోకర్ణపల్లి సమీపంలో నారాయణపురం ఎడమ కాలువ ఆయుకట్టు ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. నారాయణపురం కాలువ నుంచి కింతలి చానల్ పరిధిలోని ఆమదాలవలస, పొందూరు మండలాలకు చెందిన బెలమాం, లొద్దలపేట, తాడివలస, లచ్చయ్యపేట, గండ్రేడు, బొడ్డేపల్లి, మొదలవలస, కింతలి గ్రామాలకు చెందిన రైతులు తమ భూములకు సాగునీరు అందడం లేదంటూ ఇటీవల స్పీకర్‌ను కలిసి తెలియజేశారు. దీనివల్ల ఈ గ్రామాల పరిధిలోని సుమారు 1200 ఎకరాలకు సాగునీరు అందకపోవడంతో పంటలను పండించలేక పోతున్నామంటూ వాపోయారు. దీంతో క్షేత్రస్థాయిలో నెలకొన్న ఇబ్బందులను పరిశీలించారు. కావలి వారధి వద్ద డైవర్షన్ ద్వారా సాగునీరు అందేలా చూడడంతో పాటు నీటి ప్రవాహం ఉధృతిని పెంచి కాలువ నీరు దిగువ ప్రాంతానికి ప్రవహించేలా చర్యలు చేపట్టాలంటూ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సాగుకు సరిపడేలా నీరు అందించేందుకు తాత్కాలిక చర్యలు చేపట్టాలన్నారు. ఖరీఫ్ సీజన్ పూర్తయిన తర్వాత కింతలి చానల్‌కు సంపూర్ణంగా సాగునీరు అందించేలా పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, చింతాడ సత్యప్రసాద్, కనుగుల కిషోర్, తమ్మినేని వాసు, స్వామినాయుడు, తమ్మినేని కృష్ణకుమారి, పైడి పోలయ్య, లక్ష్మణరావు, బెండి గాంధీ, పలువురు వైసిపి నాయకులు ఉన్నారు.

నారాయణపురం కాలువ వద్ద పరిశీలిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

త్వరితగతిన పనులు పూర్తి

- రహదారుల మరమ్మతులు వేగవంతం చేయాలి
- జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందించి ప్రభుత్వ ప్రతిష్ట పెంచాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో స్థాయీ సంఘ సమావేశాలను బుధవారం నిర్వహించారు. 1, 2, 4, 7 స్థాయీ సంఘ సమావేశాలకు అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రోడ్ల మరమ్మతులకు మంజూరైన నిధులను సద్వినియోగం చేయాలన్నారు. మ్యాచింగ్ గ్రాంట్‌తో నిర్మాణంలో ఉన్న పనులు, సబ్‌ప్లాన్ నిధులతో చేపడుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

వంశధార, తోటపల్లి , మడ్డువలస, నారాయణపురం ఆనకట్టలతో పాటు మధ్య, చిన్నతరహా సాగునీటి వనరుల ద్వారా ఏటా అందుతున్న నీటి లభ్యతను తెలియజేయాలన్నారు. వంశధార నుంచి నీటిని విడుదల చేశామని, వర్షాలు కురిస్తే ముమ్మర సాగుకు వీలవుతుందని వంశధార ఎస్‌ఇ డోల తిరుమలరావు వివరించారు. త్వరలో తోటపల్లి ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన సాగునీటి వనరుల ద్వారా నీటిలభ్యత తక్కువగా ఉండడం వల్ల వర్షాధార ప్రాంతాల్లో రోడ్లు గోతులమయంగా మారాయని, వాటి మరమ్మతులు చేపట్టాలని పలువురు సభ్యులు కోరారు. ఆమదాలవలస, శ్రీకాకుళం రోడ్డు నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు.

జిల్లాలో అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సరిగా జరగడం లేదని, లోఓల్టేజి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జెడ్‌పి ఉపాధ్యక్షులు పాలిన శ్రావణి ప్రస్తావించారు. నిర్మాణంలో ఉన్న తాగునీటి ప్రాజెక్టును ఎప్పట్లోగా పూర్తి చేస్తారో నివేదించాలని సోంపేట జెడ్‌పిటిసి సభ్యులు ఎన్.దాస్ అధికారులను కోరారు. రెండో స్థాయీ సంఘ సమావేశంలో గృహనిర్మాణ, డిసిసిబి, సహకార శాఖ, చేనేత మరియు జౌళి శాఖ, ఖాదీ గ్రామీణ పరిశ్రమలు తదితర శాఖల పనితీరును సమీక్షించారు. సమావేశాల్లో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, స్థాయీసంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వ్యవస్థలో లోపాలను ఎత్తిచూపితే సహించలేరా..?

టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

పొందూరు : రాష్ట్రంలో వాలంటీర్ వ్యవస్థలో లోపాలను ఎత్తిచూపితే వైసిపి నాయకులు సహించలేక వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని బొట్లపేట, కనిమెట్టతో పాటు పలు గ్రామాల్లో టిడిపి సానుభూతిపరుల కుటుంబాలను బుధవారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గోప్యంగా ఉండాల్సిన ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే హక్కు వాలంటీర్లుకు లేదన్నారు. వ్యక్తిగత సమాచారం దుర్వినియోగమైతే, దానికి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. రాష్ట్ర ఖజానా నుంచి గౌరవ వేతనం పొందుతున్న వాలంటీర్లు వైసిపి కార్యకర్తల్లా పనిచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికలకు సంబంధించిన విధులకు వాలంటీర్లు దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను సైతం పలుచోట్ల వాలంటీర్లు బేఖాతరు చేస్తున్నారని ఆరోపించారు. ఆయనతో పాటు టిడిపి మండల అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహన్, బలగ శంకరభాస్కరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలను పరామర్శిస్తున్న కూన రవికుమార్

తీర ప్రాంతాల్లో మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - కవిటి, పోలాకి, గార

తీర ప్రాంతాల్లో అసాంఘిక శక్తులు చొరబడకుండా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే అవకాశం లేకుండా తీరం కట్టుదిట్టం చేసే చర్యలు పోలీసులు చేపట్టారు. సాగర్ కవచ్‌లో భాగంగా గార, పోలాకి, కవిటి మండలాల్లోని సముద్రతీర ప్రాంతాలైన మొగదాలపాడు, కళింగపట్నం, ఎస్.మత్స్యలేశం, డి.ఎల్ పురంతో పాటు పలు గ్రామాల్లో కోస్టల్ ఎక్సర్‌సైజ్, మాక్‌డ్రిల్‌ను బుధవారం నిర్వహించారు. సిఐ సన్యాసినాయుడు, గార, కవిటి, పోలాకి ఎస్‌ఐలు కామేశ్వరరావు, కె.రాము, వి.సత్యనారాయణ సిబ్బందితో కలిసి పరిశీలించారు. తీరప్రాంత ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు, ఇతర భాషల్లో మాట్లాడే వారు కనిపించినా, సంచరించినా ఆ సమాచారాన్ని సమీప పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. తీరం వెంబడి జిల్లాలో చొరబడి షెల్టర్ జోన్‌గా చేసుకుని పలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే అవకాశం ఉన్నందున చొరబాటుదారులను నిలువరించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో మెరైన్ పోలీసులు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

సూచనలు చేస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

మూడు బృందాలతో ఆరోగ్య సర్వే

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో మూడు బృందాలతో ఆరో విడత జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేను నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తెలిపారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని తన ఛాంబరులో సర్వే పర్యవేక్షణ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సదుపాయాలు అందుతున్న సేవలపై చేపడుతున్న సర్వే మంచి ఫలితాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఫీవర్ సర్వే ద్వారా అందుతున్న సమాచారం మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధఙలోని సచివాలయాల వారీగా ఫీవర్ క్లినిక్‌లను నిర్వహించేందుకు వీలవుతుందన్నారు.

ప్రస్తుతం చేపడుతున్న ఎన్‌సిడి సర్వేపై వైద్యాధికారులకు అవగాహన ఉండాలన్నారు. సచివాలయం పరిధిలో పాపులేషన్, ప్లానింగ్, ఇంప్లిమెంటేషన్, మోనిటరింగ్, గైడెన్స్ ఇవ్వాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఆశా కార్యకర్త, ఎఎన్‌ఎంల ఇంటింటికీ లెప్రసీ కేసుల సర్వే నిర్వహించాలన్నారు. ఈ సర్వే నివేదికలు ఎప్పఇటికప్పుడు ప్రభుత్వానికి నివేదించాలన్నారు. సమావేశంలో సిగ్మా రీసెర్చ్ టీమ్ నుంచి విజయ్ కుమార్, భరద్వాజ్, తులసీరామ్, కోఆర్డినేటర్లు రోజా, కిరణ్ కుమార్, ఐఐపిఎస్ టీమ్ విక్టర్, జ్యోతి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

18న ఆశావర్కర్ల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆశావర్కర్లకు జాబ్‌ఛార్టుతో సంబంధం లేని పనులు చేయిస్తున్నారని, ఆన్‌లైన్ పనుల పేరుతో వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18వ తేదీన జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి వెల్లడించారు. నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఎఒ భాస్కర్‌కుమార్‌కు ధర్నా నోటీసును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు కనీస మౌలిక వసతులు కల్పించకుండా పనిభారాన్ని పెంచడం తగదన్నారు. నాణ్యమైన సెల్‌ఫోన్‌తో పాటు 4జి సిమ్ ఇవ్వాలని, ఆన్‌లైన్ పనుల నిర్వహణకు శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా ఆశా కార్యకర్తలు పోరాడుతున్న ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, పనిభారం తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. నాణ్యత లేని సెల్‌ఫోన్‌లో 2జి సిమ్ ఇస్తే అందులో 14 రకాల యాప్‌లను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రశ్నించారు. మరోపక్క రికార్డులు ఇవ్వకుండా 26 రకాల రికార్డులను రాయాలని ప్రభుత్వం ఆదేశించడం తగదన్నారు. ఫోన్లు పనిచేయకపోతే సొంత డబ్బులతో ఫోన్ కొనుగోలు చేసి పనిచేయాలని వేధించడం సరికాదన్నారు. రికార్డుల పేరుతో వేతనాల్లో కోతలు విధిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. రోజూ విలేజ్ క్లినిక్, సచివాలయాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉండాలని, క్లినిక్‌లు క్లీన్ చేయడం, ఒపి వర్క్, అటెండర్ పనులు చేయించడంతో పాటు ఉదయం సాయంత్రం రెండుసార్లు రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని అధికారులు వేధిస్తున్నారని చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు బి.మురళి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు డి.సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

నోటీసును అందజేస్తున్న యూనియన్ నాయకులు

BEFORE THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE, TEKKALI.
O.S. 37/2021

Between:
BANK OF INDIA, TEKKALI BRANCH,
Represented by it's Branch Manager, TEKKALI Village/Mandal in Srikakulam District.
--Plaintiff.
And:**KAIBADI SUJATHA.**
--Defendant.

NOTICE TO THE SAID DEFENDANT

Kaibadi Sujatha, W/o Simhachalam, At present aged about 30 years, Hindu, doing Retail Kirana Business, Maddilivanipeta Village,Tamarapalli Post, Nandigam Mandal, Srikakulam District.

It is to inform you that the above said case/matter/suit i.e., O.S.37/2021 on the file of the Honourable Court of Junior Civil Judge, Tekkali in Srikakulam District is stands posted to **dt: 14-07-2023** for your APPEARANCE, and you are to appear on the above said date before the said Honourable Court **at 10:30 AM.,** in person or through your pleader/advocate, otherwise the above matter/case/suit will be decided against you. Hence, this notice.

// By order of the said Honourable Court //

KAJANA VENKATARAO,
Advocate for the Plaintiff,
TEKKALI,
Cell Nos: 9440196244.

Tekkali
Date: 12.07.2023

మెళియాపుట్టి : భోజనం రుచి చూస్తున్న లక్ష్మీరెడ్డి

ఫుడ్ కమిషన్ సభ్యుల పరిశీలన

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలో పలు గ్రామాల్లో ఫుడ్ కమిషన్ సభ్యులు బుధవారం పరిశీలించారు. ముందుగా మండలంలోని బందపల్లిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలోని భోజన సౌకర్యాలను పరిశీలించారు. అలాగే చాపరలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో 12 రోజులుగా పప్పుకు బదులుగా చారన్నం పెడుతున్నట్లు గుర్తించారు. అలాగే గుడ్లు నిల్వ ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెళియాపుట్టిలోని ఎఫ్‌సి గోదాం పరిశీలించారు. గోదాంలో వేయింగ్ మిషన్ లేకపోవడంతో సరుకులు ఎలా తూకం వేస్తున్నారని ప్రశ్నిస్తూ... ఆగ్రహం వ్యక్తం చేశారు. నేలబొంతు గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. భోజనాలు బాగు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గిరిశిఖర గ్రామాల్లోని చందనగిరి, వీరన్నపేట కూడలి గ్రామాల రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ రాష్ట్ర సభ్యులు ఇ.లక్ష్మీరెడ్డి, గంజిమాలదేవి, పౌర సరఫరాల జిల్లా అధికారి వెంకటరమణ, ఐసిడిఎస్ పిడి జయ భారతి, సిడిపిఒ విమలారాణి, తహశీల్దార్ పి.సరోజిని, ఎంఇఒ ఎస్.దేవేందరరావు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం...

టెక్కలి : విద్యార్థులకు అందించే పౌష్టికాహారంలో నాణ్యత లోపించరాదని ఆహార కమిటీ మెంబర్లు లక్ష్మీరెడ్డి, జి.దేవి, కాంతారావు అన్నారు. మండలంలోని చాకిపల్లి ప్రాథమిక పాఠశాల అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంతో పాటు చౌక ధరల దుకాణం, సరుకుల నిల్వ, గోదాంలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌తో పాటు ఆహార పదార్థాల నిల్వలు, వండిన విధానాలను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజన పదార్థాల్లో రాజీ రావద్దన్నారు. వీరితో పాటు ఐసిడిఎస్ పిఒ శోభారాణి, ఎంఇఒ దల్లి తులసీరావురెడ్డి, డిసిటిసి రమణ, సూపర్‌వైజర్ డి.లక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ శాంతి

21 నుంచి డోర్ టు డోర్ సర్వే

ప్రజాశక్తి - పొందూరు

ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు ఈ నెల 21 నుంచి ఓటర్ జాబితాపై బూత్ స్థాయిలో డోర్ టు డోర్ సర్వేను చేపట్టేందుకు ప్రణాళికలను రూపొందించినట్లు శ్రీకాకుళం ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి అన్నారు. పొందూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, బూత్‌స్థాయి అధికారులు, విఆర్‌ఒలకు డోర్ టు డోర్ సర్వేపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ఓటు కార్డుకు ఆధార్ అనుసంధానం జరిగిందా? లేదా? ఓటరు వివరాలు సక్రమంగా ఉన్నాయా? లేవా? పరిశీలించి నమోదు చేయాల్సిన బాధ్యత బిఎల్‌ఒలదే అని అన్నారు. భవిష్యత్‌లో ఈ ఓటరు జాబితాపై ఏమైనా తప్పిదాలు జరిగినా దానికి బాధ్యులుగా బిఎల్‌ఒలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ డోర్ టు డోర్ సర్వేపై ఫిర్యాదులు వస్తే బాధ్యత వహించాల్సింది బిఎల్‌ఒలేనని అన్నారు. ఈ సర్వే వచ్చే నెల 21 వరకు నిర్వహిస్తామని తెలిపారు. దీనికి సంబంధించిన మెటీరియల్ మండలాలకు చేరాయని, అక్కడి నుంచి బిఎల్‌ఒలకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్పీకర్‌కు సమస్యల వెల్లువ

ప్రజాశక్తి - ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలోని 11వ వార్డు మెట్టక్కివలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అక్కడి ప్రజలు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. 'పెద్దింటి సీతమ్మ తన భర్త మృతి చెంది మూడేళ్లు కావస్తున్నా... ఇప్పటికీ తనకు పింఛను మంజూరు చేయలేదని అన్నారు. గతంలో తన భర్తకు పింఛను ఇచ్చే వారని, ఆయన మృతి తర్వాత తనకు పింఛను మంజూరు కాలేదని వాపోయింది. వెంటనే మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్‌ను పిలిచి ఇటువంటి సమస్యలను పరిష్కరించకపోతే ఎలా అని ప్రశ్నించారు. సాంకేతికపరమైన ఇబ్బందులు ఏమైనా ఉంటే పరిశీలించి చర్యలు తీసుకొని పింఛను అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుట్టవీధిలో అక్కడి ప్రజలు రహదారి లేక చినుకు పడితే రోడ్డుపైనే నీరు నిలిచిపోయి ఇబ్బందులకు గురవుతున్నామని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. అయితే నేను పార పట్టుకుని రావాలా? అని స్పీకర్ బదులు ఇవ్వడంతో ప్రజలు అవాక్కయ్యారు. సమస్యను చెబితే అలా మాట్లాడటం ఏమిటని ప్రజలు పెదవి విరుస్తున్నారు. అదే వీధిలో గతంలో స్పీకర్ గుడ్ మార్నింగ్ ఆమదాలవలస కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు అక్కడి ప్రజలు విద్యుత్ స్తంభాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ స్తంభాలను వేశారని కానీ, నాలుగైదు నెలల నుంచి లైటును వేయకుండా అలాగే ఖాళీగా వదిలేశారని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మున్సిపల్ ఎఇ అప్పలనాయుడును పిలిచి లైటు వేయకపోవడం కారణం ఏమిటని, ఇలా విధులు నిర్వహిస్తే ఎలా అని ప్రశ్నించారు. రేవటికల్లి విద్యుత్ స్తంభానికి లైటును అమర్చాలని ఆదేశించారు. చిన్నికృష్ణ నగర్‌లో మాత్రం నక్కబాటు వర్షం పడితే ఇంట్లోకి నీరు చేరుతుందని, కాలువలు లేకపోవడంతో ఇబ్బందులు గురవుతున్నామని స్పీకర్‌కు వివరించారు. నాలుగు నెలలుగా తాగునీటి బోరు మరమ్మతులకు గురి కావడంతో నీటికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, మున్సిపల్ కార్యాలయానికి పలుమార్లు ఫిర్యాదు చేస్తే మరమ్మతులు చేపట్టారని అన్నారు. కానీ, ఇప్పటి వరకు వినియోగంలోకి తీసుకు రాలేదని చెప్పారు. ఎఇ అప్పలనాయుడును పిలిపించి ప్రతి సమస్యనూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, అజంతా కుమారి, దుంపల శ్యామలరావు, మామిడి రమేష్‌కుమార్, సాధు చిరంజీవి, అత్తులూరి రవికాంత్ పాల్గొన్నారు.

పింఛను అందడం లేదని వివరిస్తున్న సీతమ్మ

వాలంటీర్లకు నియామక పత్రాలు

మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఖాళీగా ఉన్న వాలంటీర్ల పోస్టులను మున్సిపల్ అధికారులు భర్తీ చేపట్టారు. ఈ మేరకు స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద నియామక పత్రాలను బుధవారం అందజేశారు. ఐదో వార్డు సొట్టవానిపేటకు చెందిన కశింకోట శ్యామల, రెండో వార్డు కృష్ణాపురం సిద్ది తులసి, 12 వార్డు లక్ష్మీనగర్ వీధి ఐ.నాగమణి, 16వ వార్డు వరద వారి కోటర్స్ నుంచి కుసుమకుమారిలకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, దుంపల శ్యామలరావు, పొడుగు శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం

మెప్మా పీడీ కిరణ్ కుమార్

శ్రీకాకుళం అర్బన్ : కాగితపు సంచులను ఆవిష్కరిస్తున్న పీడీ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పేపరు సంచుల తయారీని, వాడకాన్ని ప్రోత్సహిద్దామని, తద్వారా ప్లాస్టిక్ సంచుల వినియోగానికి చరమగీతం పాడుదామని మెప్మా పీడీ కిరణ్ కుమార్ అన్నారు. నగరంలోని రైతుబజారు సమీపంలో ఉన్న అభిరుచి డిపార్ట్‌మెంట్ స్టార్స్ ఆధ్వర్యాన లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు హారికాప్రసాద్ (కెఎన్ఎస్‌వి ప్రసాద్) అధ్యక్షతన ప్రపంచ కాగితపు సంచుల దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల స్థానంలో పేపరు సంచుల వినియోగాన్ని ప్రోత్సహించాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు అవకాశం కలుగుతుందని అన్నారు. జిల్లాలో కాగితపు సంచుల తయారీని ప్రోత్సహించేలా ఇచ్ఛాపురం, పలాస, ఆమదాలవలస, శ్రీకాకుళంలో కాగితపు సంచుల తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హర్షవల్లి అధ్యక్షులు కరణం శోభారాణి, అభిరుచి సూపర్ మార్కెట్ యాజమాన్యం తంగుడు అమితేష్, లయన్స్ వావిలపల్లి జగన్నాథ నాయుడు, క్లబ్ కార్యదర్శి, లయన్ సెక్రటరీ రౌతు శ్రీనివాసరావు, శాసపు జోగినాయుడు, అరసవల్లి ట్రస్టుబోర్డు సభ్యులు ఎల్.గోవిందరావు పాల్గొన్నారు.

టెక్కలి : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించాలని స్థానిక రవీంద్రభారతి పాఠశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలగబోయే నష్టాలను వివరిస్తూ నినాదాలు చేశారు. ర్యాలీని ప్రారంభించిన డీన్ నాగరాజు మాట్లాడుతూ తమ విద్యాసంస్థల విద్యార్థులు సామాజిక స్పృహతో చేస్తున్న కార్యక్రమాలను తెలియజేశారు. ఈ ర్యాలీ పాఠశాల నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వరకు సాగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ పాల్గొన్నారు.

నరసన్నపేట : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

టెక్కలి : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: సమాజంలో ప్లాస్టిక్ వాడకం నిర్మూలించాలి రవీంద్ర భారతి హైస్కూల్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు పిలుపిచ్చారు. నరసన్నపేట కేంద్రంలో రవీంద్ర భారతి హైస్కూల్ విద్యార్థులు ప్లాస్టిక్ వాడకం నిర్మూలించాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 14 వరకు స్కూల్ వారంతపు సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్లాస్టిక్ వాడకం నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఇస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు సహకారం

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పలాస

చిన్నతరహా పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయ సహకారాలు అందిస్తుందని ఉద్యానవనశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. జీడి పప్పు ఉత్పత్తిదారుల సంఘం భవనంలో వ్యాపారులకు ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాలు, పరిశ్రమలు, ప్రోత్సాహంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం కింద వ్యాపారులకు అందించే రాయితీలు, ప్రోత్సాహకాలు అందుకుని జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వ్యాపారులకు కావాల్సిన ఆధునిక పరికరాలు, నిర్మాణాలకు అయ్యే ఖర్చు 10 శాతం మాత్రమే వ్యాపారులు భరించాల్సి ఉంటుందని అన్నారు. మిగిలిన 90 శాతం బ్యాంకు ద్వారా రుణాలు కల్పిస్తుందని అన్నారు. బ్యాంకు రుణంలో 35 శాతం సబ్సిడీ ఉంటుందని పేర్కొన్నారు. దీంతో పాటు సంబంధిత వ్యాపారాలపై సాంకేతిక సలహాలు, నిపుణులతో సూచనలు చేస్తామన్నారు. మార్కెట్‌లో పోటీకి తట్టుకునే విధంగా ప్రభుత్వాలు ఆర్థికసాయం అందిస్తుందన్నారు. ఆహార ఉత్పత్తులకు సంబంధించి ఏ పరిశ్రమల స్థాపనకు తాము తోడ్పాటు అందిస్తామని స్పష్టం చేశారు. దీనికి చెందిన వివరాలు ఉద్యానవనశాఖ, పరిశ్రమలశాఖ కార్యాలయాలకు సంప్రదించాలన్నారు. అనంతరం వ్యాపారులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఇన్‌ఛార్జి డి.దివ్య, పిసిఎంఎ అధ్యక్షుడు మల్లా సురేష్ కుమార్, కార్యదర్శి కె.వి.శివకృష్ణ, కోశాధికారి పట్నాన రవికాంత్, పారిశ్రామికవాడ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు, కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, శాసనపురి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోవిందపురంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

మండలంలోని గోవిందపురానికి చెందిన గేదెల రమేష్ (32) మృతి చెందారు. పోలీసులు తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి నుంచి బయటకు వెళ్లిన రమేష్ రాత్రయినా ఇంటిరి రాకపోవడంతో పరిసరాల్లో వెతికారు. ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం గోవిందపురం కొత్త చెరువు గట్టుపై మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు ఎక్కువగా మద్యం తీసుకోవడం వల్ల ఇంటికి చేరుకోలేక గట్టుపై రాత్రంతా ఉండి పోయాడని, నీళ్ల అందక మృతి చెంటాడని అందరూ భావిస్తున్నారు. మృతుడికి భార్య గౌరమ్మ, పిల్లలు సంధ్య, దారవి ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ మధుసూదన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివరాలను సేకరిస్తున్న పోలీసులు

కిరాణా దుకాణంలో చోరీ

కంచిలి : మండల కేంద్రం కంచిలికి చెందిన శాసనపురి రామారావు కిరాణా జనరల్ స్టోర్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. మెయిన్ రోడ్డు పక్కన ఉన్న కిరాణా షాపుపై భాగంలోని రేకును కత్తిరించి గుర్తు తెలియని వ్యక్తులు లోపలకు వెళ్లి రూ.పది వేలు విలువ చేసే సామగ్రిని దొంగిలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సి సుశీల్‌కుమార్ పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

కవిటి : మండలంలోని మాణిక్యపురం గ్రామ సమీపంలోని కొబ్బరి తోటల్లో పేకాట శిబిరంపై దాడిచేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.రాము తెలిపారు. వారివద్ద రూ.3,150లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కొన్ని రోజులుగా పేకాట ఆడుతున్న సమచారం రావడంతో దాడులు నిర్వహించామని అన్నారు. పేకాట శిబిరాలపై నిఘా పెట్టామని తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

సన్మానిస్తున్న తులసీదాస్‌రెడ్డి

కష్టపడితే ఉజ్వల భవిష్యత్

ఇచ్ఛాపురం : కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సిఐ ఈశ్వర్ చంద్ర ప్రసాద్ విద్యార్థులకు సూచించారు. మున్సిపాలిటీలోని స్వర్ణ భారతి డిగ్రీ కళాశాలలో చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం ఫేర్‌వెల్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సిఐ మాట్లాడుతూ రాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. అనంతరం తులసీదాస్‌రెడ్డి, సతీమణి, చాట్ల సుజాత సిఐకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సంస్కృతి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ చాట్ల రాము, ప్రిన్సిపల్ కె.సందీప్, జయప్రకాష్, కో-ఆర్డినేటర్ నీలిమారెడ్డి ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మ బంగారు చంద్రయాన్-3 నమూనా

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 21వ వార్డు గాంధీనగర్‌కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ సూక్ష్మ కళాకారుడు కొత్తపల్లి రమేష్ ఆచారి ఇస్రో శాస్త్రవేత్త ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రయోగాత్మకం చంద్రయాన్-3 చంద్రమండలం పైకి వెళ్లబోతుంది. దాని నమోనాలు స్వర్ణంతో విక్రమ్ ల్యాండర్ ప్రజ్ఞా రోవర్ సూక్ష్మ కళారూపాలను తయారు చేసి అబ్బురపరిచాడు. దీని బరువు కేవలం 0.700 మిల్లీ గ్రాములు, అనగా ఒక అణా ఎత్తు 916 కేడియం బంగారాన్ని ఉపయోగించ ఉపయోగించారు. దీని ఎత్తు కేవలం ఒక సెంటీమీటర్ వెడల్పు రెండు సెంటీ మీటర్లు శాస్త్రవేత్తలు చేస్తున్న కృషికి గాను ఈ సూక్ష్మ కళారూపాన్ని తయారు చేశారు. వాటిని తయారు చేసేందుకు ఒకరోజు సమయం పట్టినట్లు కళాకారుడు రమేష్ ఆచారి తెలిపారు.

- ప్రజాశక్తి, పలాస

చంద్రయాన్-3 నమూనా

నీలంపేట పాఠశాలలో వర్షపు నీరు

'నాడు-నేడు' సిమెంట్ నీటిపాలు

పాఠశాల ఆవరణలో చేరిన వర్షపునీరు

ప్రజాశక్తి - రణస్థలం

మండలంలోని నీలంపేట ప్రాథమిక పాఠశాల వర్షం పడితే చాలు నీటిలోనే మునుగుతుంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 50 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల లోతట్టు ప్రాంతంలో ఉండడంతో వర్షం పడితే నీరు లోనికి రావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు గతంలో నానా అవస్థలు పడుతుండేవారు. అయితే పంచాయతీ పెద్దలు వర్షం నీరు పాఠశాల లోనికి రాకుండా పాఠశాల చుట్టూ కాలువ నిర్మించారు. దీంతో ఈ సమస్యకు పరిష్కారమైంది. అదే గ్రామానికి చెందిన వ్యక్తి పాఠశాలకు అనుకుని ఉన్న కాలువను మట్టితో కప్పేశారు. మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి వర్షం నీరు పాఠశాల లోనికి వచ్చి నాడు- నేడు పనులు కోసం తెప్పించిన 30 బస్తాలు సిమెంట్ వర్షం నీటిలో మునిగి పాడైపోయింది. అలాగే ఇసుక, తదితర మెటీరియల్ వర్షం నీటిలో తడిసిపోయాయి. అలాగే పాఠశాలలో ఉన్న బీరువాలు, పుస్తకాలు తడిసి పోవడంతో ఉపాధ్యాయులు నానా అవస్థలు పడ్డారు. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సునీల్, గ్రామ పెద్దలకు ఎంఇఒ త్రినాతరావుకు ఫిర్యాదు చేశారు.

సంక్షోభంలో జీడి పరిశ్రమలు

పిసిఎంఎ అధ్యక్షులు సురేష్ కుమార్

ప్రజాశక్తి - పలాస

జీడి పరిశ్రమ సంక్షోభంలో ఉందని, జీడిపప్పు ధరలు తగ్గుతుండటంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని జీడి రైతులు కార్మికులు అర్థం చేసుకోవాలని జీడి పరిశ్రమల సంఘం అధ్యక్షుడు మల్లా సురేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. పలాస జీడి పరిశ్రమ సంఘం కార్యాలయంలో బుధవారం రాత్రి నియోజకవర్గం పరిధిలోని జీడి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, గుజరాత్, అస్సాం, తమిళనాడు, చత్తీష్ఘడ్, రాజస్థాన్, పంజాబ్, తెలంగాణ వంటి ఇతర రాష్ట్రాల్లో జీడి ఉత్పత్తి ఎక్కువ స్థాయిలో జరుగుతుందన్నారు. అందుచేతనే పరిశ్రమలను బంద్ చేయాల్సి వచ్చిందన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని పలు రాజకీయ నాయకులు జీడి కార్మికులకు, రైతులకు పక్క దోవ పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కార్యదర్శి కె.వి.శివకృష్ణ, కోశాధికారి పట్నాల రవికాంత్ పారిశ్రామికవాడ అధ్యక్షులు మల్లా రామేశ్వరరావు, కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, హరిపురం సంఘ సభ్యులు శ్రీనివాసరావు మందస సంఘ సభ్యులు ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సురేష్ కుమార్

పవన్‌కు రాజకీయాలపై అవగాహన లేదు

మాట్లాడుతున్న శ్రీకాంత్

కొత్తూరు: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయాలపై అవగాహన లేకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలని తూర్పుకాపు చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. స్థానిక బజారు వీధిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అన్యాయమన్నారు. వాలంటీర్లు సేకరించిన సమాచారం మేరకు నేరుగా ప్రభుత్వం లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వ్యక్తిగత ఖాతాలకు జమ చేయడంలో దేశంలోనే ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈయనతో పాటు పాటు వైసిపి నాయకులు గోగుల వరప్రసాదరావు, పడాల లక్ష్మణరావు, పిన్నింటి రామారావు నాయుడు, జడ్డు రామకృష్ణ, ఎం.చందు, దారపు శ్రీరామకృష్ణ, కె.వి.నాయుడు, ఎడ్ల గోవింద ఉన్నారు.

జనసేన నాయకుల ర్యాలీ

ఇచ్ఛాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి - కవిటి

గ్రామ, వార్డు, మున్సిపాలిటీ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న వాలంటీర్లు ఇటీవల తమ అధినేత పవన్‌కళ్యాణ చేసిన ప్రసంగాల్లో వాస్తవాలు తెలుసుకోవాలని, వైసిపి నాయకులు చేస్తున్న వంచనకు గురికావద్దని ఇచ్ఛాపురం జనసేన నాయకులు లోళ్ల రాజేష్ హితవు పలికారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల తమపై చేసిన వ్యాఖ్యలపై వాలంటీర్లు ఆందోళన చేస్తున్నారు. ఈ ఆందోళనకు నిరసనగా రాజేష్ ఆధ్వర్యాన కవిటిలో జన సైనికులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఏం మాట్లాడారో కూడా తెలియకుండానే వాలంటీర్లు ఆందోళనలు చేస్తున్నారని, ఈ విషయం గత రెండు రోజులుగా మీడియాలో కూడా బహిర్గతమైందని అన్నారు. వీటిని ప్రభుత్వం, వైసిపి నాయకులు చిలువలు పలువలుగా చేసి కేవలం రూ.5 వేలు వెట్టిచాకిరీ చేయించుకుంటున్న వాలంటీర్లను రెచ్చగొడుతున్నారని విమర్శించారు.

రణస్థలం : ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు

రణస్థలం: రణస్థలం మండల కేంద్రంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఫొటోలకు, ఫ్లెక్సీలకు పాలాభిషేకం, పూలాభిషేకం చేశారు. వైసిపి నాయకులు వాలంటీర్ల కలిసి పవన్ కళ్యాణ్ ఫొటోలను, దిష్టి బొమ్మలను దహనం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన నాయకురాలు కాంతిశ్రీ, కరిమజ్జి మల్లేష్, గోవిందరెడ్డి దుర్గారావు, వడ్డాది శ్రీను, దన్నాన చిరంజీవి పాల్గొన్నారు. అనంతరం రణస్థలంలో ర్యాలీ నిర్వహించారు. వారాహి పంతం- వైసిపి అంతం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అర్జున్ భూపతి, బస్వ గోవింద్‌రెడ్డి, దుర్గారావు, వడ్డాది శ్రీనివాసరావు, కరిమజ్జి మల్లేశ్వరరావు, చిరంజీవి, సువ్వాడ రామారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఉద్దానంలో కిడ్నీ వ్యాధి తీవ్రతపై ప్రపంచానికి తెలియజెపిన జనసేన అధినేత పవన్‌కళ్యాణపై ప్రభుత్వం, వాలంటీర్లు అకారణంగా విమర్శలు చేయడం సరికాదని నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు అన్నారు. వాలంటరీలను వైసిపి నాయకులు రెచ్చగొట్టి పవన్ కళ్యాణ్ బొమ్మను దహనం చేసిన నిరసనగా పార్టీ కార్యాలయం నుంచి జన సైనికులు ర్యాలీ నిర్వహించారు.

కవిటి : ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు

అనంతరం బస్టాండ్ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. జనసేన మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర కార్యదర్శి నాగుల హరి బెహరా, పార్టీ నేతలు దుర్గాసి నీలవేణిరెడ్డి, డొక్కరి ఈశ్వరరావు, రోకళ్ల భాస్కర్, దాసరి శేఖర్, ఢిల్లీ పాల్గొన్నారు.

నాయకుల అరెస్టు

టెక్కలి రూరల్ : పవన్ దిష్టిబొమ్మను వాలంటీర్లు తగలబెట్టడాన్ని నిరసిస్తూ స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ కుమార్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు జనసేన నాయకులను అరెస్టు చేశారు.

టెక్కలి రూరల్ : పోలీస్‌స్టేషన్‌లో జనసేన నాయకులు

'జగనన్న సురక్ష'తో విస్తృత సేవలు

ప్రజాశక్తి - పోలాకి

నిరంతరం ప్రజలతో మమేకమై ప్రజలకు సేవ చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని గాతలవలస, ఉరజాం సచివాలయాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాతలవలసలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఎటువంటి ధ్రువపత్రాలు అవసరమైనా వెంటనే అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, ఎఎంసి చైర్మన్ చైర్మన్ దుంపల భాస్కరరావు, వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు, కణితి సత్తిబాబు పాల్గొన్నారు.

రణస్థలం : రణస్థలం మండల కేంద్రం జె.ఆర్.పురం-2 సచివాలయం పరిధిలోని గరికిపాలెంలో జగనన్న సురక్షలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొన్ని 11 రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కవిటి: సిఎం జగన్‌కి అభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లని, వీటి కోసం నిరంతరం తపన పడుతుంటారని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. మండలంలోని వరకలో నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.శేఖర్, సర్పంచ్ సావిత్రి పురియా, నాయకులు పిన్నింటి తిలక్, మురిపాల లచ్చయ్య, శ్రీకాంత్ పురియా, పిరియా కృష్ణారావు, బెండి జగదీష్, బడగల రాజేంద్రం పాల్గొన్నారు.

ఆమదాలవలస : జగనన్న సురక్షతో సేవలు విస్తృతంగా అందుతున్నాయని తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ అన్నారు. మండలంలోని కట్యాచార్యుల పేటలో జగనన్న సురక్షలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం అర్హులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్‌బాబు, సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, చిలకలపల్లి సురేష్, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, తహశీల్దార్ ఎన్.గణపతి పాల్గొన్నారు.

ఆమదాలవలస : ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న వాణిశ్రీ

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి సచివాలయం వద్ద సర్పంచ్ కాళ్ల సంజీవరావు ఆధ్వర్యాన నిర్వహించిన జగనన్న సురక్షలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, తహశీల్దార్ జామి ఈశ్వరమ్మలు 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం, వైస్ ఎంపిపిలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా, బోయిన కృష్ణారావు పాల్గొన్నారు.

నందిగాం: భవిష్యత్ తరాల అభివృద్ధే ధ్యేయంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని కాపు తెంబూరులో సర్పంచ్ పోలాకి మోహనరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 11 రకాల ధ్రుపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, సుభద్రాపురం సర్పంచ్ బోరుభద్ర సోమేశ్వరరావు, ఎంపిటిసి లపల్లినిపల్లి ధనరాజ్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిడిఒ శివప్రసాద్, తహశీల్దార్ పద్మావతి, దిమిలాడ పిఎసిఎస్ అధ్యక్షులు బాలక మధుసూదనరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని కంబాలరాయుడుపేటలో సర్పంచ్ వంక చిరంజీవి ఆధ్వర్యాన నిర్వహించిన జనగన్న సురక్షలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, అమలపాడు సర్పంచ్ దున్నరత్నం బాలరాజు, ఎంపిటిసి కారి వెంకటరావు, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలో బెల్లుపడలో 12,13 వార్డుల సరివాలయాల ప్రాంగణంలో నిర్వహించిన జనగన్న సురక్షలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఇందులో భాగంగా 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి, కమిషనర్ రమేష్, కౌన్సిలర్ బచ్చు జగన్, నీలవు లక్ష్మి, మధుమూర్తి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు పాల్గొన్నారు.

పలాస : మండలంలో లొత్తూరు పంచాయతీలో నిర్వహించిన జనగన్న సురక్షలో వైస్ ఎంపిపి సవర దాలమ్మ, సర్పంచ్ సవర పద్మ, ఎంపిడిఒ రమేష్‌నాయుడు, తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు, పంచాయతీ విస్తరణ అధికారి మెట్ట వైకుంఠరావు పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు.

కవిటి : మాట్లాడుతున్న ప్రకాష్

సన్మానిస్తున్న వ్యవస్థాపక సభ్యులు

తెప్పలకు 'ఐరావతం' జాతీయ పురస్కారం

ప్రజాశక్తి- పలాస

పలాసకు చెందిన జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు, నటులు, రచయిత, లయన్స్ జిల్లా చైర్మన్ తెప్పల కృష్ణమూర్తి ఐరావతం జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు చెందిన ఆదర్శ కళానిలయం ఆధ్వర్యాన కోఠి డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిర్‌లో నిర్వహించిన జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో పురస్కారం అందజేశారు. ఇందులో భాగంగా దుశ్శాలువతో సన్మానించి ప్రశంసాపత్రం, ఐరావతం ప్రతిమ పుష్పమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆదర్శ కళా నిలయం వ్యవస్థాపకులు చేరాల ప్రకాష్, డాక్టర్ కె.మాణిక్, సీనియర్ టివి, సినిమా నటులు డాక్టర్ అశోక్ కుమార్, దివ్యవాణి, మలక్‌పేట శైలజ డాక్టర్ పి.షణ్ముఖశర్మ, వర్ధమాన హీరో విజయ భాస్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హెచ్ఎం జగన్నాథరావు

శతశాతం ఉత్తీర్ణులు కావాలి

లావేరు : పదో తరగతి చదువుతున్న విద్యార్థులు చక్కగా చదువుకుని శతశాతం ఉత్తీర్ణులు కావాలని లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.జగన్నాథరావు అన్నారు. పాఠశాలల ఆవరణలో స్పందన, ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన బుధవారం సీడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కులు తక్కువ వచ్చినట్లయితే క్షణిక ఆవేశానికి గురై తప్పుడు నిర్ణయాలు తీసుకోకూడదని అన్నారు. ఫౌండేషన్ సభ్యులు మురపాక శ్రీనివాసరావు విద్యార్థులకు నైపుణాభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. స్టడీ స్కిల్స్, ఎమోషనల్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, ఫైనాన్షియల్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థీ క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. అలాగే కాసులకు, పుస్తకాలకే పరిమితము కాకుండా జనరల్ నాలెడ్జ్‌పైనా దృష్టిసారించాలన్నారు. తొందరపాటు నిర్ణయాలతో తప్పుడు ఆలోచనలకు పాల్పడవద్దని సూచించారు. తొలుత విద్యార్థులతో 'క్షణికావేశానికి లోనై జీవితాన్ని నాశనం చేసుకోమని, తల్లిదండ్రుల ఆశలు ఆకాంక్షలను తీరుస్తామని' ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెంతు ఒరియాలను ఎస్‌టిగా గుర్తించాలి

నౌపడ : బెంతు ఒరియాలను ఎస్‌టిలుగా గుర్తించాలని యామలపేట గ్రామస్తులు కోరారు. ఈ మేరకు హనుమంతునాయుడుపేట వద్ద నిర్వహించిన జగనన్న సురక్షలో తహశీల్దార్ చలమయ్యను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో మాదిరిగా బెంతు ఒరియాలకు ఎస్‌టిలుగా గుర్తించి ధ్రువపత్రాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి ముదిలి సంజీవ్, విఆర్ఒ కామేష్, సొట్ట రవి, గిరిబాబు, వెంకటరమణ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

మెళియాపుట్టి : మెళియాపుట్టిలోని పర్లాకిమిడి రోడ్‌లో చేపడుతున్న పారిశుధ్య పనులు టెక్కలి డిఎల్‌పిఒ ఐ.వి.రమణ బుధవారం చేపట్టారు. గ్రామంలో పారిశుధ్య సమస్య లేకుండా చూడాలని స్థానికులకు, అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రతినిధి రేఖాన, ప్రతినిది వాసు పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

మెళియాపుట్టి : మండలంలో పెద్దలక్ష్మీపురం ఎంపియుపి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎంఇఒ పద్మనాభం బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధిని, పాఠశాలల పరిశుభ్రత, రికార్డులను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణమూర్తి, కన్నారావు, సిఆర్‌పి ప్రభావతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

యూరియాను పంపిణీ చేస్తున్న మధుకేశవరావు

యూరియా పంపిణీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రైతుల పక్షపాతి జగనన్న ప్రభుత్వమేనని పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు అన్నారు. మండలంలోని నగరంపల్లి సచివాలయంలో రైతులకు 800 బస్తాలు యూరియా, డిఎపి ఎరువులను బుధవారం పంపిణీ చేశారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, యంత్ర పరికరాలు రైతు బరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రైతు భరోసా విత్తనాలపై సబ్సిడీపై విత్తనాలు, ఉచిత పంటల భీమా, పంట రుణాలపై, వడ్డీ రాయితీ వంటి పథకాలతో రైతులకు అండగా నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి బమ్మిడి మోహనరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చైర్మన్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ విస్తరణ పనులను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులపై దృష్టి పెట్టాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కాశీబుగ్గ హరిశంకర్ థియేటర్, శ్రీనివాస్ లాడ్జి కూడలి వద్ద కాలువ పనులను బుధవారం మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువ లింకులు పనులు ముందుగా పూర్తి చేస్తే మురుగు నీరు రోడ్లపై ప్రవహించకుండా ఉంటుందన్నారు. లింకులు వద్ద పనులు చేసే సమయంలో ఆయా వీధుల ప్రజలు రాకపోకలు చేసేందుకు వీలుగా చర్యలు చేపట్టాలన్నారు. కాలువ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు, ఇంకా ఏమైనా ఉంటే తక్షణమే తొలగించాలన్నారు. ఈయనతో పాటు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, టిపిఒ సీతారాం, మున్సిపల్ డిఇఇ బల్ల హరి, మున్సిపల్ ఎఇఇ

కాలువ విస్తరణ పనులను పరిశీలిస్తున్న గిరిబాబు

అవినాష్, డబ్బీర్ నాగు, మొదలవలస మన్మథరావు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

మున్సిపాలిటీ పరిధిలో అంతర కుడ్డ బిటి రోడ్ పనులను మున్సిపల్ అధికారులతో పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. రూ. 30 లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నారు.

సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలి

కాశీబుగ్గ ఎస్ఎఫ్ఎస్ పాఠశాల సమీపంలో రోడ్డు అధ్వానంగా ఉందని, నిత్యం విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారని కాశీబుగ్గ ఎస్ఎఫ్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. చైర్మన్ మాట్లాడుతూ పాఠశాల సమీపంలో కాలువతో పాటు సిసి రోడ్డు నిర్మాణం చేపడతామని, అందుకు రూ. 5 లక్షలు నిధులను కేటాయిస్తున్నామని అన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల సిబ్బంది ఉన్నారు.

పవర్ బోర్ మంజూరు చేయాలి

పలాస బత్తుల వీధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు మున్సిపల్ చైర్మన్ వద్ద మహిళలు మొరపెట్టుకున్నారు. పలాస మున్సిపల్ చైర్మన్ కార్యాలయంలో బత్తుల వీధిలో పవర్ బోర్ మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. పెట్టి పవర్ బోర్ మంజూరు చేస్తామని హామీనిచ్చారు. అప్పటి వరకు ట్యాంకుల ద్వారా తాగునీరు అందిస్తామని చెప్పారు. వార్డు వైసిపి ఇన్‌ఛార్జి లోకనాథం బెహరా ఉన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లపై సర్వే వేగవంతం

ప్రజాశక్తి- పలాస

గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లపై సర్వే వేగవంతం చేయాలని ఎంపిడిఒ ఎస్.రమేష్ నాయుడు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయా? లేవా? ఇంకుడు గుంతలు ఉన్నాయా? లేవా? మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంకు పాడైన వివరాలను సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించాలన్నారు. ఒక ఇంకుడు గుంత ఉంటే మరో గుంత నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నుంచి వృథా నీరు వీధి రోడ్లపైకి రాకుండా చూడాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జిల్లా పంచాయతీ రిసోర్స్ పర్సన్ పేరాడ ఆనందరావు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి మెట్ట వైకుంఠరావు, కార్యదర్శులు లండ శ్రీధర్, సుధాకర్, డి.రవి, కింతల రవి, సద్గుణబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌నాయుడు

సోంపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో బుధవారం సమీక్షించారు. జగనన్న సురక్ష, వ్యక్తిగత మరుగుదొడ్లు, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ, ఇతర కార్యక్రమాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వాసుదేవరావు, ఇఒ వరప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం వెనక్కి

ప్రజాశక్తి- పలాస

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో టిడిపి ఆధ్వర్యాన భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో యువతకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు వచ్చాయని, వైసిపి పాలనలో ఉద్యోగుల కోసం యువత ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. నిత్యవసర వస్తువులతో పాటు విద్యుత్, పెట్రోల్, బస్ ఛార్జీలు సైతం విపరీతంగా పెంచేస్తున్నారని, దీంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముందుగా ఇంటింటికి వెళ్లి

మహిళలకు వివరిస్తున్న బాబూరావు

చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో పోస్టరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిసిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, నవీన్, గాలి కృష్ణారావు హనుమంతు మురళిదొర, అంబటి కృష్ణమూర్తి, గోళ్ల చంద్రరావు, జోగ మల్లి, రవిశంకర్ గుప్తా, రామకృష్ణ, యవ్వారి మోహనరావు, రమేష్ పాల్గొన్నారు.

నీమాస్త్రం కషాయంతో తెగుళ్ల నివారణ

నీమాస్త్రం కషాయాన్ని తయారు చేస్తున్న రైతులు

ఆమదాలవలస : నీమాస్త్రం కషాయంతో పంటల్లో వచ్చే తెగుళ్లను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు తెలిపారు. మండలంలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన రైతులతో నీమాస్త్రం కషాయాన్ని బుధవారం తయారు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కషాయం తయారీలో వేపాకులు, ఆవు మూత్రం, పేడను ఉపయోగించి తయారు చేస్తారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తెగుళ్లు, పురుగులు నియంత్రణకు కషాయాల ప్రాముఖ్యత చాలా ఉందని అన్నారు. సరైన సమయంలో తయారు చేసుకుని పంటలపై పిచికారీ చేయడం వల్ల ఎటువంటి తెగుళ్లను, పురుగులను నివారించవచ్చునని తెలిపారు. పంట వేసుకున్న 15 రోజుల తర్వాత ముందుగా పిచికాచీ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సోంపేట: మండలంలోని బేసి రామచంద్రపురంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మండల యాంకర్ కుమారి బుధవారం రైతులకు నీమాస్త్రం తయారీపై అవగాహన కల్పించారు. ఈ ద్రావణాన్ని పంటపై పిచికారీ చేయడం వల్ల పంటలకు ఆశించే రసం పీల్చే పురుగులు నాశనం అవుతాయని తెలిపారు. సేంద్రీయ వ్యవసాయం వల్ల అధిక దిగుబడులు సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నీలవేణి, గీత, లత, రైతులు ధర్మారావు, జోగారావు, సరస్వతి, శకుంతల పాల్గొన్నారు.

అప్పలనాయుడు పరామర్శ

లావేరు : మండలంలోని మురపాకకు వండనా సిమ్మినాయుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల వైసిపి నాయకులు లుకాలపు అప్పలనాయుడు బుధవారం పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్యం యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఎంపిటిసి ప్రతినిది తేనెల సురేష్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు శివంగం నాగరాజు, మీసాల జగన్, వండాన శ్రీను, పతివాడ గురునాయుడు ఉన్నారు.

పంచాయతీరాజ్ కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ కార్యవర్గం ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా కె.రామారావు. ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కె.దేవీప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా వై.నీలవేణి, కోశాధికారిగా వి.ఆర్. పాణిగ్రహిలు, జిల్లా కౌన్సిలర్‌గా సత్యాదేవి, ఎం.శ్రీధర్‌లను ఎన్నుకున్నారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఎపి శాసనమండలి సభ్యులు చడిపిరాళ్ల శివనాథ్‌రెడ్డి కుటుంబసమేతంగా బుధవారం సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో వారికి స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి ఆలయ ఇఒ సూర్యప్రకాష్ జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు కృష్ణామాచార్యులు పాల్గొన్నారు.

హరిబాబుకు సన్మానం చేస్తున్న పిఇటిలు

హరిబాబుకు సత్కారం

ప్రజాశక్తి- పలాస

వ్యాయామ విద్య ఉపాధ్యాయునిగా పాతికేళ్ల ప్రస్థానంలో ఆటకు ఆయువు పోసి, ఎందరో క్రీడారత్నాలను తీర్చిదిద్దిన కచ్చి హరిబాబు క్రీడా రంగానికి స్ఫూర్తికిరణమని పిఇటిల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.తవిటయ్య అన్నారు. ఇటీవల ఉద్యోగోన్నతితో వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా హరిబాబు చేరారు. ఈ సందర్భంగా పిఇటిల సంఘం ఆధ్వర్యాన బుధవారం పలాసలో ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ సంఘ సాంకేతిక కమిటీ చైర్మన్‌గా, కన్వీనర్ వ్యవహరిస్తున్న హరిబాబు అంతకు ముందు వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ ఉపాధ్యక్షునిగా, జోనల్, జిల్లా స్థాయిలో మరిన్ని పదవులు నిర్వహించారని అన్నారు. ఆయన మార్గదర్శకత్వంలో పలాస, కాశీబుగ్గలో పలుమార్లు రాష్ట్రస్థాయి పోటీలు విజయవంతమయ్యాయని, ఇకముందు కూడా ఆటకు ఆయన ప్రోత్సాహం ఉండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా, జోనల్ సంఘ ప్రతినిధులు ఎస్.రామారావు, పిహెచ్.పద్మలోచనం, ఎస్.వి.జోగారావు, పి.గజేంద్ర, బి.శంకరరావు, ఎస్.చంద్రశేఖర్, పి.రవికాంత్, జి.లోకేశ్వరరావు పాల్గొన్నారు.

'సొండి'లను ఒబిసిలో చేర్చాలి

శ్రీకాకుళం అర్బన్ : కుల వృత్తిని కోల్పోయి జీవనాధారం లేక ప్రత్యామ్నాయ వృత్తుల్లో కూలీలుగా పనిచేయాల్సి వస్తోందని నవ్యాంధ్ర సొండిల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు నెమలిపురి కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రజాసదన్‌లో పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సొండిలను ఒబిసి జాబితాలో చేర్చేందుకు సాయమందించాలని విన్నవించారు. ఈయతో పాటు ఎం.కిషోర్‌కుమార్, రత్నాల నర్సింహమూర్తి ఉన్నారు.

జయరాంకు నగదు అందిస్తున్న ఉపాధ్యాయులు

సిఆర్‌పికి ఉపాధ్యాయుల అండ

కవిటి: మండలంలోని ఆర్.బెలగాం కాంప్లెక్స్ పరిధిలో 15 ఏళ్లుగా సిఆర్‌పిగా పనిచేస్తున్న గ్రామానికి చెందిన జీరు జయరాంకు మండలంలోని ఉపాధ్యాయులు అండగా నిలిచారు. జయరాం కొద్ది కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుసుకున్న ఉపాధ్యాయులు ఏకమై కొంతమొత్తం సేకరించారు. ఆ విధంగా సేకరించిన రూ.75 వేలను కవిటి, మందస మండల విద్యాశాఖ అధికారులు ధనుంజయ మజ్జి, ఎం.లక్ష్మణరావు చేతులు మీదుగా బుధవారం జయరాంకు అందించారు. కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

కవిటి: ఉద్యోగికి తాను చేసిన సేవలే గుర్తింపుని స్తాయని బి.జి.పుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖగేశ్వరరావు అభిప్రాయ పడ్డారు. బి.జి.పుట్టుగ హైస్కూల్‌లో సరళ 11 ఏళ్లు ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేసి బదిలీపై వెళ్లడంతో బుధవారం ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఖగేశ్వరరావు మాట్లాడుతూ 11 ఏళ్లుగా సరళ అందించిన సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న రైతులు

ఆక్రమణలు తొలగించాలి

ఇచ్ఛాపురం : పట్టణంలోని ప్రధాన చెరువు కోటేరు బంద ఆక్రమణలకు గురైందని, తక్షణమే ఆక్రమణలను తొలగించి అభివృద్ధి పనులు చేపట్టాలని బెల్లుపడ రైతులు, పెద్దలు స్పష్టం చేశారు. బెల్లుపడకు చెందిన పెద్ద చెరువుకోటేరు బంద అభివృద్ధికి రూ.74 లక్షలు మంజూరు కావడంతో రైతులు ఒక్కసారిగా కదలిక వచ్చారు. వెంటనే దండోరా వేయించి ఎల్లమ్మ ఆలయం వద్ద బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రతినిధి పిలక సంతోష్‌తో చర్చించారు. 32 నుంచి 36 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువు ఆక్రమణకు గురైందని, మున్సిపల్, రెవెన్యూ అధికారుల సమక్షంలో సమగ్ర సర్వే చేపట్టి ఆక్రమణలు తొలగించి అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. దీంతో పాటు చెరువు అభివృద్ధికి నిధులు దుర్వినియోగం కాకుండా పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని పెద్దలు సూచించారు. వర్షాకాలంలో పనులు చేయడం వల్ల దిగువ ప్రాంతంలో సాగు చేస్తున్న రైతాంగానికి నష్టం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆసీ చిరంజీవిరెడ్డి, బడే దొరబాబురెడ్డి, కూర్మారెడ్డి, చాట్ల లోహిదాస్‌రెడ్డి, దుర్గాసి పాపారావు, అనపాన పీతాంబరరెడ్డి, ఉప్పాడ చిన్నబాబురెడ్డి, కొండ శంకర్‌రెడ్డి, ఉప్పాడ చిన్న, రాజు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

హక్కుల సాధనకు ఉద్యమం

బిసి జాతీయ నాయకులు రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తమ హక్కుల సాధనకు బిసి, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యమానికి సిద్ధం కావాలని జాతీయ బిసి నాయకులు బోడే రామచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు. నగరంలోని పెద్ద రోడ్డులో ఉన్న పద్మావతి కళ్యాణ మండపంలో ప్రజా సింహగర్జన సన్నాహక సభ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుటుంబ రాజకీయాల తప్ప ప్రజా రాజకీయాలు రాష్ట్రంలో కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, బహుజనులంతా అనేక సమస్యలతో సతమతమవుతు న్నారని చెప్పారు. ఈ నెల 23 న మంగళగిరిలో నిర్వహించ నున్న రాష్ట్ర స్థాయి సభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాగితాపు వెంకటరమణ, పానిలా ప్రసాద్, ఇప్పిలి చిన్న, పిట్టా చంద్రపతిరావు, కంఠ వేణు, జాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నియామకపు పత్రాన్ని అందజేస్తున్న విజయ

కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలో పనిచేస్తూ వివిధ కారణాలతో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపడుతూ ఉత్తర్వులను జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ బుధవారం అందజేశారు. మృతి చెందిన ఉద్యోగుల వారసులు ఎస్.కుమార్‌కు ఆఫీసు సబార్డినేటరుగా జెడ్‌పి కార్యాలయంలో నియమించారు. అలాగే కేదార్‌సాయి పాడికి జలుమూరు మండలం అల్లాడ జెడ్‌పి హైస్కూల్‌లో నియమించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ వెంకటరామన్, డిపిఒ రవికుమార్ పాల్గొన్నారు

నగదు అందజేస్తున్న ఎంపిటిసి విమల

విశాఖ డెయిరీ చేయూత

కంచిలి : మండలంలోని పెద్దశ్రీరాంపురానికి చెందిన భాస్కరరావు అనే పాడి రైతుకు విశాఖ డెయిరీ సంస్థ చేయూత అందించింది. ఇటీవల భాస్కరరావుకు చెందిన పాడి ఆవు మృతి చెందింది. రైతుకు సంస్థ తరపున రూ.24 వేలు నగదును స్థానిక గ్రూప్ లీడర్, ఎంపిటిసి మాదిన విమల బుధవారం అందించారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ పాడి రైతులను అన్ని విధాలా విశాఖ డెయిరీ సంస్థ చేయూత అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సూపర్‌వైజర్ ఈశ్వరరావు, పాడి రైతులు శంకరరావు, వైకుంఠరావు, నాగేంద్ర, చలపతి, కన్నబాబు, భూపతి పాల్గొన్నారు.